ప్రజాశక్తి
గురువారం 26 అక్టోబర్ 2023
5
విజయనగరం



పైడితల్లి అమ్మవారి దర్శనానికి నేటి నుంచి రూ.300 టికెట్ల విక్రయం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పైడితల్లి అమ్మవారి దర్శనానికి 300 రూపాయల టిక్కెట్లను గురువారం నుంచి విక్రయిస్తున్నట్లు సహాయ కమిషనర్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టిక్కెట్లను న్యూపూర్ణ వద్దనున్న కెనరా బ్యాంక్ మెయిన్ బ్రాంచ్, ఆలయం వెనుక నున్న కెనరా బ్యాంక్ బ్రాంచ్ తో బాటు గుడి వద్ద కూడా విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 2000 టిక్కెట్లను విక్రయించడానికి సిద్ధం చేశామని, ఈ టిక్కెట్లతో అమ్మవారి తొలేల్లు, సిరిమానోత్సం జరిగే 30, 31 తేదీలలో దర్శనానికి అనుమతిస్తారని తెలిపారు.

ఆరుగాలం కష్టించి పండించిన పంట కళ్ల ముందే ఎండిపోతుంటే రైతన్న కడుపు తరుక్కుపోతోంది. నెలరోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో జిల్లా వ్యాప్తంగా వరిపంట ఎడిపోతోంది. పొట్టదశలో గింజ కట్టే సమయంలో నీరులేక వరిపైరు అల్లాడిపోతోంది. ఈ తరుణంలో వాటిని రక్షించుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఈనెల 22,23 తేదీల్లో తుఫాను వస్తుందని వాతావరణశాఖ సూచనలు చూసి రైతుల ఆశలు చిగురించాయి. తుపాను తీవ్రత ఎలా ఉన్నా కనీసం వర్షం పడితే ఊపిరి పోసినట్లు అవుతుందని రైతులు భావించారు. కానీ తుపాను మన రాష్ట్రానికి, జిల్లాకు లేకపోవడంతో రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి. వరుణుడు ఊరించి..ఉసూరుమనిపించడంతో ఆవేదన చెందుతున్నారు.



తెర్లాం మండలంలో ఎండిపోతున్న వరిచేను చూపిస్తున్న రైతులు

ఊరించి..ఉసూరుమనిపించి

వర్షం కోసం రైతన్న ఎదురుచూపు



పురిటిపెంటలో ఎండిపోయిన వరిచేను చూపిస్తున్న రైతు



నెల్లిమర్ల మండలం చంద్రం పేటలో ఎండిపోయిన వరి చేను

ప్రజాశక్తి-నెల్లిమర్ల, రేగిడి, తెర్లాం

ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా లేకపోవడంతో వరి రైతు కష్టాలు పడుతున్నాడు. ముఖ్యంగా వరి పంట సాగు చేసే రైతు వర్షం కోసం గత నెలరోజులుగా ఆకాశం వైపు చూస్తున్నాడు. నెల్లిమర్ల మండలంలో 4,895 ఎకరాల్లో వరి సాగు జరుగుతుండగా ప్రస్తుతం వర్ష భావం పరిస్థితుల్లో కొండ వెలగాడ, చంద్రం పేట పరిధిలో 6 ఎకరాల్లో వరిపంట ఎండి పోయినట్లు తెలుస్తోంది. సతివాడ ప్రాంతంలో ఈ నెలాఖరులోగా వర్షాలు కురవకపోతే పూర్తి స్థాయిలో వరి పంట ఎండి పోతుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి ఈ నెల వరకు సాధారణ వర్షపాతం 1962.64 మిల్లీమీటర్ల కురవాల్సి ఉండగా ఇంతవరకు 1772.36 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు లెక్కలు చెబుతున్నాయి. సాధారణ వర్షపాతం కంటే 190.09 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు కనిపిస్తుంది. ప్రస్తుతం మండలంలో వరిపంట పొట్ట దశలో ఉండడతో ఈ పరిస్థితుల్లో వర్షం అవసరం ఎంతైనా ఉందని ఇప్పుడుగాని అనుకున్న రీతిలో గింజ దశలో వర్షాలు కురవకపోతే కనీసం తిండి గింజలు కూడా రాని దుస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రేగిడి మండలంలో వరి పంటను రక్షించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని చెరువులు నీటి నిల్వలు అరకొరగానే ఉన్నాయి. బోరు బావులు, ఇతర నీటి సదుపాయాలు ఉన్న ప్రాంతాల్లోనే ఇంజన్లు తోను, చెరువు ప్రాంతాల్లో అయితే వరి పంటలు కాపాడేందుకు బిందెలతో నీరు వేయవలసిన పరిస్థితి ఉంది. ఈ నెలాఖరు వరకు పరిస్థితి ఇలానే ఉంటే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవలసిన పరిస్థితి వస్తుందని ఆ పంటలకు సైతం నీరు కావలసి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాజాం మండలంలో 12,435 ఎకరాలు, రేగిడి మండలంలో 13,478 ఎకరాలు, వంగర 9,570 ఎకరాలు, సంతకవిటి మండలంలో 11,264 ఎకరాలలో వరి పంటలు వేశారు. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ వర్షపాతం నమోదు కాలేదు. దీంతో పంటలు ఎండిపోయే పరిస్థితికి వచ్చాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టులు ఉన్నప్పటికీ శివారు భూములకు నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెర్లాం మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలు లేక వరి చేలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. వర్షాధారం మీద ఆధారపడి పెరుమాలి, టెక్కలి వలస, కొత్తవలస, కాలంరాజుపేట, డి గడపవలస ఇలా అనేక గ్రామాల్లో వరినాటు వేశారు. ఇప్పుడు వర్షాలు లేక వరిచేలు మొత్తం ఎండిపోయే పరిస్థితి దాపురించింది. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టినా ప్రయోజనం లేదని అప్పులు పాలవుతున్నామని రైతులు వాపోతున్నారు. పెరుమాలి గ్రామంలో ఎర్ర చెరువు, కొత్తచెరువు కింద ఉన్న ఆయకట్టుదారులు కోరగంజి అశోక్ కుమార్, కే శంకర్రావు, ధర్మారావు, పెద్దింటి వెంకటరమణ పంటలు నష్టపోయినట్లు చెబుతున్నారు. కరువు మండలంగా ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

గజపతినగరం మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలు లేక వరి చేలు ఎండిపోయాయి. పురిటిపెంట గ్రామం పరిధిలో సుమారు వంద వంద ఎకరాల్లో పొట్టదశలో వరి ఎండిపోయింది. చెరువులన్నీ అడుగంటి పోవడంతో రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఇంతవరకు పెట్టిన పెట్టుబడులు అయినా చేతికి వస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రామానికి బట్టి కాలువ ఉన్నా, అధికారుల నిర్లక్ష్యంతో అది కబ్జాకు గురైంది. దీంతో రైతులకు సాగునీరు అందడం లేదు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

జలజీవన్ మిషన్ పనులు వేగవంతం

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జలజీవన్ మిషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జెజెఎం, జిజిఎంపి ఇతర అభివృద్ధి పనులపై గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్లతో బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ మండలాల్లో జరిగిన జెజెఎం పనుల పురోగతిని ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ బి.ఉమాశంకర్ వివరించారు. కాంట్రాక్టర్ల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జెజెఎం పనులను త్వరగా పూర్తి చేసి, ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. ఇంకా టెండర్లు ఖరారు కానిచోట, త్వరగా ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. యుద్ధప్రాతిపదిక పనులను పూర్తి చేసి, శతశాతం ఇళ్లకు తాగునీరు అందించే విధంగా కార్యాచరణను అమలు చేయాలని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద పనులను పూర్తిచేసిన వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో 50 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి అయినచోట, తక్షణమే తాగునీటి సరఫరా చేయాలని, దీనికి వెంటనే చర్యలు ప్రారంభించాలని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ విద్యాసుందర రాజన్, డిఇలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో టి.అప్పలరాజు,టి.విజయ్, కె.కిరణ్ సాధించగా, రెండో స్థానంలో ఎస్.ఉదయ్,జి.వాసు, టి.అప్పలరాజు , మూడో స్థానంలో ఎ.జితేంద్ర, పి.బాలాజీ, కె.విజయ్ నిలిచారు. విజేతలను జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శంకరరావు, కోరాడ శ్రీనివాసరావు అభినందించారు.

కరువు పరిస్థితులపై ప్రత్యామ్నాయ ప్రణాళిక

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రస్తుత ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటల పరిస్థితిపై జిల్లా కలెక్టర్, అధికారులతో చర్చించామని, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు చర్యలు చేపడతామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. జిల్లాలో తుఫాను కారణంగా వర్షాలు కురుస్తాయని ఆశించామని, మరికొద్ది రోజులపాటు వర్షాలు లేనట్లయితే 30శాతం మేరకు పంటలకు నష్టం వాటిల్లే అవకాశం వుందని అధికారులు వివరించారని చెప్పారు. ఈ విషయమై ప్రభుత్వం అప్రమత్తంగా వుందని, పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు చేపడుతుందని అన్నారు.

పొరపాట్లు పునరావృతం కానివ్వం

పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా గత ఏడాది సిరిమాను ఊరేగింపులో జాప్యం జరిగిందని, ఈ ఏడాది అటువంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులకు ఆదేశించామని మంత్రి చెప్పారు. జాతీయ స్థాయి డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన ఈ ఏడాది ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. సమావేశంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

సహాయ కమిషనర్ ప్రసాదరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని విటి అగ్రహారం బిసి కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ, మయూరి జంక్షన్ వద్దనున్న లార్డ్ కిచినర్ పాఠశాలలోనూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరిగాయి. ఆయా కేంద్రాలలో సుమారు 800 వరకు ప్రజలు తమ ఆరోగ్య పరీక్షలను ఉచితంగా చేయించుకున్నారు. సాధారణ పరీక్షలతోపాటు శస్త్ర చికిత్సలకు అవసరమైన పరీక్షలను కూడా జరిపి నిర్ధారిత చికిత్సలకు రిఫరల్ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్లు జివి రంగారావు, చందక శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాలలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించే శిబిరాలను ఏర్పాటు చేశారు.

ఢిల్లీ ఉచిత సందర్శనకు యువతకు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర ప్రభుత్వం ఏక్ భారత్ - శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమంలో భాగంగా 'యువ సంఘం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, దీనిలో భాగంగా ప్రతి రాష్ట్రము నుంచి 18 నుండి 30 సంవత్సరాల యువకులు 50 మందిని ఎంపికచేసి వారిని టూర్‌కు పంపుతారని గిరిజన యూనివర్శిటీ విసి కట్టమణి తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో గల పర్యాటకం, సంస్కృతి-సంప్రదాయాలు, ప్రగతి (అభివృద్ధి), పరస్పర ప్రజల మధ్య అనుసంధానం, టెక్నాలజీలను పరిచయం చేసి వాటిని వివిధ కోణాల లో అధ్యనయం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎపి, ఢిల్లీలను అనుసంధానించి 'ఆంధ్ర ప్రదేశ్ యువతను ఢిల్లీకి', 'ఢిల్లీ వారిని ఆంధ్ర ప్రదేశ్ కి' పంపించాలని నిర్ణయించారని తెలిపారు. స్థానిక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని నోడల్ సంస్థగా నియమించారని తెలిపారు. ఈ కార్యక్రమం డిసెంబర్‌లో జరుగుతుందని ఆసక్తి గల 18 నుండి 30ఏళ్ల వయసుగల యువకులు తమపేర్లను ఈనెల 28లోగా https://ebsb.aicte-india.org ను క్లిక్ చేసి నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు డాక్టర్ కుసుమ్ 9813220169, డాక్టర్ ఎస్ వివిఎస్ సూర్యనారాయణ 9666633885 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

29, 30 తేదీల్లో ఉత్తరాంధ్ర వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా ఈనెల 29,30 తేదీల్లో స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తామని నిర్వాహకులు కనకల కృష్ణ, అసోసియేషన్ కార్యదర్శి భగవాన్ దాస్ తెలిపారు. బుధవారం రాజీవ్ గాంధీ క్రీడా ప్రాంగణంలో ఉన్న వాలీబాల్ కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా కనకల.యాత్రయ్య జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలకు తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం,విజయనగరం, భోగాపురం, ఎస్ కె అకాడమీ కొత్తవలస జట్లు పాల్గొంటాయని తెలిపారు. రెండు రోజుల పాటు ఫ్లడ్ లైట్ల వెలుతురులో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలో విజేతగా నిలిచిన జట్టుకు రూ.20వేలు, ద్వితీయ స్థానం రూ.15వేలు, తృతీయ స్థానానికి రూ. 10వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన జట్టు కు రూ.5వేలు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు.

స్విమ్మింగ్ పోటీలకు 80 మంది ఎంపిక

67వ స్కూల్ గేమ్స్‌లో భాగంగా బుధవారం స్విమ్మింగ్ అండర్-14, 17బాల బాలికల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు స్థానిక డిఎస్ఎ స్విమ్మింగ్ పూల్ కంటోన్మెంట్ లో నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుండి సుమారుగా 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో 80 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ తెలిపారు. వీరు నవంబర్ 8వ తేదీ నుంచి 10 వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ పోటీలను జిల్లా చీఫ్ కోచ్ అచ్యుత్ పర్యవేక్షించారు.



కాంస్య పతకం సాధించిన గురునాయుడు

జాతీయ పోటీల్లో కాంస్య పతకం

గోవాలో జరుగుతున్న 37 వ జాతీయ పోటీల్లో జిల్లాకు చెందిన వెయిట్ లిఫ్టర్ ఎస్.గురునాయుడు మరో సారి సత్తా చాటారు. 55 కేజీల విభాగంలో 104, 126 కేజీల మొత్తం 230 కేజీల బరువు ఎత్తు మూడో స్థానం లో నిలిచి కాంస్య పతకం సాధించాడు.



పోలీసుల త్యాగాలకు విద్యార్థులకు వివరిస్తున్న డిఎస్‌పి గోవిందరావు

అమరుల త్యాగాలు వృథా కారాదు

డిఎస్‌పి గోవిందరావు

ప్రజాశక్తి-విజయనగరం

పోలీసు అమరుల త్యాగాలు వృథా కావని డిఎస్‌పి ఆర్‌గోవిందరావు అన్నారు. పోలీసు అమరుల సంస్మరణ దినం సందర్భంగా విజయనగరం పోలీసుశాఖలో పని చేసి, మావోయిస్టులతో పోరాడి మృతి చెందిన పోలీసు అమరవీరుల కుటుంబాల నివాస గృహాలను, వారు విద్యాభ్యాసం చేసిన పాఠశాలలను పోలీసు అధికారులు, సిబ్బంది బుధవారం సందర్శించారు. జిల్లా ఎస్‌పి ఎం.దీపిక ఆదేశాలతోడిఎస్‌పి ఆర్.గోవిందరావు, విజయనగరం 1వ పట్టణ సిఐ బి.వెంకటరావు, 2వ పట్టణ సిఐ ఎన్‌హెచ్ విజయ ఆనంద్, ఎస్.కోట సిఐ ఎస్.బాలసూర్యారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు అమరులు షేక్ ఇస్మాయిల్, చిట్టిపంతుల చిరంజీవిరావు ఇళ్లను సందర్శించి, వారు విద్యాభ్యాసం చేసిన పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ - మావోయిస్టు దాడిలో మరణించిన షేక్ ఇస్మాయిల్ చరిత్ర రాబోయే తరాలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో నేడు కస్పా హై స్కూలును సందర్శించామన్నారు. చిట్టి పంతుల చిరంజీవిరావు చదువుకున్న ఎస్.కోట మండలం కొట్టాం జెడ్‌పి హైస్కూల్‌ను డిఎస్‌పి సందర్శించారు. వీరి త్యాగాలు వృథా పోకుండా మంచి లక్ష్యాలతో ఉన్నతంగా ఎదగాలని, సమాజానికి, కన్నవారికి మంచి పేరు తెచ్చే విధంగా నడుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో 2వ పట్టణ సిఐ ఎన్.హెచ్.విజయ ఆనంద్, ఎస్.కోట సిఐ ఎస్.బాలసూర్యారావు, ఎస్ఐలు, భాస్కరరావు, షేక్ శంకర్, జె.తారకేశ్వరరావు, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడు ఉదయభాను సస్పెన్షన్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న టిడిపి నియోజకవర్గ నాయకుడు గర్భాపు ఉదయభానును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్ చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని సెల్‌ఫోన్ల ద్వారా వాయిస్ మెసేజ్‌లు పంపడం, ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో అధిష్టానం ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరు ఇలా ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా ఉత్సవాల నిర్వహణ : మంత్రి బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

పైడితల్లి అమ్మవారి జాతరలో భాగంగా ఈనెల 29,30,31 తేదీల్లో నిర్వహిస్తున్న విజయనగర ఉత్సవాలను అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో జయప్రదం అయ్యేలా చూడాలని రాష్ట్ర విద్యా శాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఉత్సవాల టీజర్ ను, ఆహ్వాన పత్రాలను మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి , జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, మేయర్ విజయలక్ష్మి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పండగ మూడు రోజులు నగరం అంతటా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ శాఖ ఎస్ఇ లక్ష్మణ రావుకు సూచించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా సరఫరా ప్రతి రోజు ఉండేలా చూడాలని మున్సిపల్ కమీషనర్ శ్రీ రాములు నాయుడుకు సూచించారు. సిరిమాను అనంతరం భక్తులు తరలి వెళ్ళడానికి అవసరమగు బస్సులను సిద్ధంగా ఉంచాలని, ముఖ్యగా విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం, సాలూరు రూట్లలో అదనపు బస్సు ను వేయాలని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని అత్యవసర మందులతో మెడికల్ క్యాంపును, అత్యవసర వాహనాలను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఒడాక్టర్ భాస్కరరావుకు ఆదేశించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ విఐపి లంతా సోమవారం నాడే దర్శనాలు చేసుకోవాలని తెలిపారు. సిరిమానును సమయానికి ప్రారంభ మయ్యేలా అటవీ శాఖ, దేవాలయ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఆహ్వాన పత్రాలను విఐపిలకు, జిల్లా అంతట ప్రజా ప్రతినిధులకు ముందుగానే అందించాలని అన్నారు.

13 వేదికలలో వినోద కార్యక్రమాలు : కలెక్టర్

ఉత్సవాలను మూడు రోజుల పాటు 13 వేదికలలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఉత్సవ ప్రారంభోత్సవ ర్యాలీ 29న ఉదయం 8.30 గంటలకు పైడితల్లి అమ్మవారి ఆలయం నుండి గురజాడ కళాభారతి వరకు జరుగుతుందన్నారు. అనంతరం 11 గంటలకు ఉత్సవ ప్రారంభోత్సవ సభ గురజాడ కళాభారతి వద్ద జరుగుతుందని తెలిపారు. 29, 30 తేదీలలో ఆనంద గజపతి ఆడిటోరియంలో సంగీత నృత్య ప్రదర్శనలు, కచేరీలు, లయన్స్ కమ్యూనిటీ హాల్ లో కర్రసాము, పులి వేషాలు, తప్పెటగుళ్ళు , ధింసా తదితర జానపద కళా రూపాల ప్రదర్శన ఉంటుందన్నారు. కోటలో సైన్సు ఫేర్, సంగీత కళాశాలలో పుష్ప, ఫల ప్రదర్శన ఉదయం 10 నుండి రాత్రి 9 వరకు ఉంటుంద న్నారు. గురజాడ కళాభారతిలో సాంఘిక నాటికలు, ఏక పాత్రాభినయాలు, లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో కవి సమ్మేళనం, సాహిత్య గోష్టి, అష్టావధానం తదితర సాహిత్య కార్యక్రమాలు ఉంటాయన్నారు. కోట ముందు ప్రాంతం లో 30వ తేదీ రాత్రి, 31 న సిరిమాను ఉత్సవం అనంతరం పులివేషాల పోటీలు ఉంటాయన్నారు. రాజీవ్ క్రీడా ప్రాంగణంలో పలు క్రీడలను నిర్వహిస్తామని తెలిపారు. అదే ప్రాంగణంలో 30న బెలూన్ల ప్రదర్శన, గాలి పటాల ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. అయోధ్య మైదానంలో 30 న డాగ్ షో, పెట్ షో ఉంటుందని తెలిపారు. కోట ఎదురుగా బొంకుల దిబ్బ గ్రౌండ్స్ లో ప్రఖ్యాత సురభి నాటక ప్రదర్శనలు మాయా బజార్, భక్త ప్రహ్లాద, బాలనాగమ్మ నాటకాలు మూడు రోజుల పాటు ఉంటాయన్నారు.

సమావేశంలో డిప్యూటీ మేయర్ లయ యాదవ్, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఇంచార్జ్ ఎస్‌పి అసమా ఫరీన్, డిఆర్‌ఒ అనిత, ఉత్సవ కమిటీ సభ్యులు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి. రమేష్, అసిస్టెంట్ కమీషనర్ సుధారాణి, జిల్లా పరిషత్ సిఇఒ రాజ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి , మున్సిపల్ కమిషనర్ శ్రీ రాములు నాయుడు, పలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్, జెడ్‌పి చైర్మన్, కలెక్టర్, మేయర్

అయోధ్యా మైదానంలో అనూప్ రూబెన్స్ మ్యూజికల్ నైట్

ఈనెల 30 రాత్రి అయోధ్యా మైదానం లో ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ ఆధ్వర్యం లో మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో నాటు నాటు ఫేం రాహుల్ సిప్లిగంజ్ , బులెట్ బండి పాట తో పాపులర్ అయిన మోహన భోగరాజు సింగర్స్‌తో పాటు జబర్దస్త్ రామ్ ప్రసాద్, బందం కామెడీ షో ఉంటుందన్నారు. 31 వ తేదీన రాజీవ్ గాంధీ స్టేడియం లో జరిగే బాణా సంచా కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ప్రజలంతా ఈ ఉత్సవాలను వీక్షించి ఆనందం పొందాలని కోరుతున్నట్లు తెలిపారు.

చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ

లోయర్ ట్యాంక్ బండ్‌లో నున్న మన్సాస్ గ్రౌండ్ లో డ్వాక్రా చేనేత ఉత్పతుల ప్రదర్శన ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాల నుండి 250 స్టాళ్ళ ను ఏర్పాటు చేస్తున్నామని, ఎపి లో 26 జిల్లాల నుండి ప్రతి జిల్లాకు 3 స్టాల్స్ చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 28 నుండి నవంబర్ 8 వరకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ఎగ్జిబిషన్ వద్ద ఓపెన్ డయాస్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



అధికారికి వినతి పత్రాన్నిస్తున్న కాలనీ వాసులు, నాయకులు

రిజర్వ్ స్థలంలో పట్టాలు ఇవ్వొద్దు

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలోని గొల్లపల్లి దాడితల్లి కాలనీలో కల్యాణ మండపం కోసం ఉంచిన రిజర్వ్ స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు పట్టాలు ఇవ్వవద్దని మాజీ కౌన్సిలర్ కాకల వెంకటరావు, పి ఈశ్వరరావు, కాలనీ ప్రజలు డిమాండ్ చేశారు. రిజర్వ్ స్థలంలో పట్టాలు ఇవ్వవద్దని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ఆర్డిఒ కార్యాలయ ఏవో గణపతి, తహశీల్దార్ డోల రాజేశ్వరరకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో కల్యాణ మండపం కోసం ఉంచిన రిజర్వ్ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు కోసం పట్టాలు ఇస్తున్నారని, రిజర్వ్ స్థలంలో పట్టాలు ఇవ్వకుండా వేరేచోట పట్టాలు ఇవ్వాలని కోరారు. రిజర్వ్ స్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు ఎన్. గోపాలం, టి.సింహాచలం, కె.సత్యం, డి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'ఉమ్మడి మేనిఫెస్టోని ఆహ్వానిస్తున్నాం'

ప్రజాశక్తి - జామి

టిడిపి, జనసేన పార్టీలు సంయుక్తంగా పది హామీలతో త్వరలోనే విడుదల చేయనున్న ఉమ్మడి మేనిఫెస్టోని లోక్ సత్తాపార్టీ ఆహ్వానిస్తోందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. బుధవారం జామిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలని లోక్‌సత్తా పార్టీ నిరంతరం ఆశిస్తోందన్నారు. టిడిపి, జనసేన పార్టీల జెఎసిలో అభివృద్ధి కోరుకుని కలిసి పనిచెయ్యడానికి సిద్ధపడే రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను, మేధావులను కలుపుకోవాలని భీశెట్టి కోరారు. రెండు పార్టీలు విడుదల చేసే ఉమ్మడి మేనిఫెస్టోలో రాష్ట్ర ప్రగతికి అవసరమైన అన్ని విషయాలు, పెండింగ్ ప్రాజెక్టుల వివరాలు, ఆర్థిక అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం తదితర అంశాలపై ఉండాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రయోజనం కోసం జెఎసి చేసే ప్రతి కార్యక్రమంలో ఎక్కువ మంది ప్రజలు యువత స్వతంత్రంగా పాల్గొనేందుకు తగిన ప్రణాళికను రెండు పార్టీల నేతలు రూపొందించాలని భీశెట్టి కోరారు.



నాయకులతో మాట్లాడుతున్న తహశీల్దార్ ధర్మరాజు

ఓటర్ల జాబితా సరిచూసుకోవాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ప్రతి గ్రామంలో తయారైన ఓటర్ల జాబితాను ప్రజాప్రతినిధులు సరిచూసుకోవాలని తహశీల్దార్ ధర్మరాజు తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం అన్ని పార్టీల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టిడిపి ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పార్లమెంట్ అధికారి ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు, నగర్ పంచాయతీ ప్రధాన కార్యదర్శి అవనాపు సత్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి వృద్ధునికి గాయాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కారు అదుపు తప్పి వృద్ధున్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. బొబ్బిలి నుంచి రామభద్రపురం వైపు వెళుతున్న కారు అదుపు తప్పి ఫ్లాట్ ఫామ్ పైకి దూసుకుపోయింది. కారు ఎదురుగా ద్విచక్ర వాహనంతో వస్తున్న మహారాణిపేటకు చెందిన చింతల సీతంనాయుడును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే సీతంనాయుడును ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుండి ఆర్‌టిసి స్పెషల్ డ్రైవ్

శృంగవరపుకోట: ఆర్‌టిసిలో పార్సల్స్, కొరియర్‌లు డోర్ డెలివరీ కోసం గురువారం నుండి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌కోట డిపో మేనేజర్ కె రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌టిసిలో రాష్ట్ర స్థాయిలో ఈ నెల 26 నుంచి నవంబర్ 25 వరకు స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామని ఉత్తరాంధ్ర జిల్లాలలో విశాఖ, విజయనగరం, పలాస, బొబ్బిలి, శ్రీకాకుళం, మద్దిలపాలెం, అనకాపల్లితో పాటు నర్సీపట్నంలో కూడా ఈ డోర్ డెలివరీ సదుపాయం కల్పించా రన్నారు. ఆయా పట్టణాలలో 10 కిమీ పరిధి వరకు డోర్ డెలివరీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడి నుండి ఎక్కడికైనా 24 గంటల్లో డోర్ డెలివరీ చేయనున్నట్లు వెల్లడించారు. ఒక కిలో పార్సిల్‌కు రూ.18, 6కిలోలకు రూ.30, పది కిలోలకు రూ. 36, 25 కిలోలకు రూ.48, 25- 50 కిలోలకు రూ. 59 వసూలు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీలంపేట రహదారి పనులు పూర్తి చేయాలి

వీరఘట్టం: మండలంలోని హుస్సేనపురం ఏడో బ్రాంచ్ నుండి నీలంపేట వరకు రహదారి నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, మండల నాయకులు ఎన్.సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీ సాయి బాలాజీ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో గత టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.4.65 కోట్లతో రహదారి నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. ఆరు గిరిజన గ్రామాలకు ఇదే రహదారని, ఐదేళ్ల నుంచి పనులు పూర్తి కాకపోవడంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే వి.కళావతి సొంత మండలంలో ఈ పరిస్థితి ఉన్న పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీతంపేట చేరుకున్న క్రీడా పరికరాలు

సీతంపేట : విజయవాడ ఎస్‌ఎస్‌ఎ నుంచి సీతంపేటకు క్రీడా పరికరాలు చేరుకున్నాయని ఎంఇఒలు పూర్ణచంద్రరావు, ఆనందరావు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్ తెలిపారు. క్రీడా సామగ్రిని బుధవారం వారు పరిశీలించారు. త్వరలో సీతంపేట మండలంలోని పాఠశాలలకు వీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పాచిపెంట

అసమానతలు లేని అభివృద్ధి కోసం ఈ నెల 30 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు చేపట్టే ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు మంచాల శ్రీనివాసరావు, పి.సన్యాసిరావు, కోరాడ ఈశ్వరరావు కోరారు. పాచిపెంటలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 31న మధ్యాహ్నం 12 గంటలకు సాలూరు పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య సంరక్షణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రసాయన ఎరువులు లేని పంటలను పండించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పెద్దపెంకి షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని దిగుమండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పండిస్తున్న కూరగాయల పంటలను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని.. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పాలక దేవానంద్, ఉపాధ్యాయులు గణేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజల వద్దకే వైద్యం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల వద్దకే ఉచిత వైద్య సేవలందిస్తున్నామని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు అన్నారు. బుధవారం తంగుడుబిల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని వారు సందర్శించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితిలను, వారికి చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. వైద్యులు మీ దగ్గరకి వచ్చి ఆరోగ్య తనిఖీలు చేసి చికిత్స, మందులు అందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, జడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు, ఎంపిడిఒ గిడుతూరి రామారావు, సతివాడ పిహెచ్‌సి వైద్యాధికారి బి.సాయి నందిని తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస.. వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సీతామహాలక్ష్మి

తెర్లాం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని తహశీల్దార్ రతన్ కుమార్ అన్నారు. మండలంలోని లోచర్ల సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమకు అవసరమైన పరీక్షలు చేయించుకొని మందులు ఉచితంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: పేద ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రజలకు శ్రీరామరక్ష అని కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి అన్నారు. కొత్తవలసలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని, అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు వేస్తూ రాష్ట్ర ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంఇఒ బండారు శ్రీనివాసరావు, పంచాయతీ ఇఒ సిహెచ్ కన్నబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, మేలాస్త్రి అప్పారావు, గొరపల్లి రవి, డాక్టర్ సీతామహాలక్ష్మి, అంగన్వాడి సూపర్‌వైజర్ రవణమ్మ, వైద్యాధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా చూడాలన్నదే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఎస్.కోట తలారి సచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజులు వేరువేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు వచ్చిన రోగులను స్వయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ వారికి వైద్యులు ఇచ్చే వైద్యాన్ని తెలుసుకొని పేదల ఆరోగ్యమే జగనన్న దేయమని రోగులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పెనిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, స్థానిక సర్పంచ్ రంధి అరుంధతి, అనంత్, జెసిఎస్ మండల ఇంచార్జి వాకాడ సతీష్, ఆవాల కృష్ణ, పోతనపల్లి కూనిరెడ్డి వెంకటరావు, ధర్మవరం అల్లు మహాలక్ష్మి నాయుడు, గట్టి రెడ్డి పైడితల్లి, అవతారం, ఎస్‌కోట తలారి రమణ, వీరనారాయణం సోంబాబు, సోషల్ మీడియా కో కన్వీనర్ జయశంకర్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: మందులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నేడు భోగాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష

భోగాపురం: భోగాపురం సచివాలయం-2 పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎంపిడిఒ ఎన్ అప్పలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అందరు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బాలికలకు వసతి సౌకర్యం కల్పించండి

ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి- వేపాడ

ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన, మోడల్ స్కూల్లో హాస్టల్ సదుపాయం లేకపోవడం అన్యాయమని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దెల రమణ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని బక్కునాయుడుపేట మోడల్ స్కూల్‌ను, అనుబంధ హాస్టలను వారు పరిశీలించారు. అనంతరం చల్లా జగన్ మాట్లాడుతూ మండలం నలుమూలల నుంచి సుమారు 650 మంది మోడల్ స్కూల్లో చదువుకునేందుకు నానా ప్రయాసలతో వెళుతున్నారని, అందులో బాలికలే 350 మంది ఉన్నారని తెలిపారు. ప్రతిరోజు బాలికలను తల్లిదండ్రులు మోడల్ స్కూల్‌లకు దించలేక, వయసు వచ్చిన ఆడపిల్లను పంపించే ఆధారం గానీ తోవ గాని లేక తల్లిదండ్రులతో పాటు అమ్మాయిలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. మోడల్ స్కూల్ ఏర్పాటు చేసిన కొన్ని సంవత్సరాలకు 100 మందికి మాత్రమే హాస్టల్ అని షరతలు పెట్టారని, మిగిలిన 250 మంది బాలికల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మోడల్ స్కూల్లో చదువుతున్న 650 మందికి హాస్టల్ సౌకర్య కల్పించాలని, తక్షణమే స్కూల్లో చదువుతున్న ఆడపిల్లలందకీ హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వాలు, అధికారులు స్పందించి మోడల్ స్కూల్‌లలో అన్ని వసతులతో హాస్టల్ సౌకర్యం కల్పించి బాలికల చదువుకోసం అన్ని రకాలగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



పాఠశాలను పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగ్ని ప్రమాద భాదితులకు ఆర్ధికసాయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని స్థానిక బాలికోన్నత పాఠశాల ఎదురుగా ఉన్న భరిణెలు తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తున్న చేతి వృత్తిదారుల ఇంటిలో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి బుధవారం బాధితులను కలిసి పరామర్శించారు. అనంతరం అగ్ని ప్రమాదం గల కారణాలను భాదితులను అడిగి తెలుసుకున్నారు. ఆమెతోపాటుగా టిడిపి నాయకులు అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. బాధితులు కందాల చంద్రరావు దంపతులు ఇచ్చిన వివరాలు ప్రకారం మంగళవారం ఉదయం పై ఇంటిలో నుండి ఒక్కసారిగా దట్టమైన పొగ వస్తుండడంతో స్థానికులు చూసి చెప్పగా కొందరు అగ్నిమాపకాధికారులకు సమాచారాన్ని చేరవేయగా, మరికొందరు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నం చేశారన్నారు. అంతలోనే జరగరాని ఘోరం జరిగిపోయిందని బాధితులు మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ముందు కన్నీటి పర్యంతమయ్యారు. ఇంటిలో ఉన్న ఏసీలు, రిఫ్రిజిరేటర్, టీవీలు, మంచాలు, బీరువాలు, వంట సామాగ్రిలుతో పాటు అన్నీ అగ్నిప్రమాదంలో కాలి బూడిదయ్యాయని వాపోయారు. ఈ సందర్భంగా లలిత కుమారి తక్షణ ఆర్థికసాయం రూ.5వేలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జీ.ఎస్. నాయుడు,ఉపాధ్యక్షులు సరిపల్లి రామకృష్ణ, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, నాయకులు కోనేదం మల్లేశ్వరరావు, పొట్నూరు అప్పలరాజు, విశాఖ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, చక్కా కిరణ్ కుమార్, గనివాడ బంగారు నాయుడు, అనకాపల్లి చెల్లయ్య, వాకాడ బాల ఈశ్వర్ భరత్ (బాలు), పెదగాడ రాజు, బుత్తల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



రైతులతో మాట్లాడుతున్న బేబినాయన, రాజా, జనసేన నాయకులు

రైతులకు సాగునీరు ఇవ్వడంలో విఫలం

తెర్లాం : రైతులకు సాగునీరు ఇవ్వడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జనసేన మండల అధ్యక్షులు ఎం.రవి అన్నారు. తెర్లాం మండలంలోని సాగునీరు లేక ఎండిపోతున్న వరిపంటను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అప్పలంపేట, బూరిపేట, ఎన్. బూర్జవలస, నెమలాం గ్రామాల పంట పొలాలకు సాగునీరు వెళ్లే కాలువలు అధ్వాన్నంగా వుండడంతో రైతులకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. రైతు ప్రభుత్వం అని చెపుతున్న వైసిపి ప్రభుత్వం రైతులకు సాగునీరు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రైతులకు సాగునీరు ఇవ్వాలని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతులు పక్షాన పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమపోటు నుంచి వరిని రక్షించాలి

ప్రజాశక్తి - కొత్తవలస

రైతులు వరి పంటను ఆకు ముడత, దోమపోటు నుంచి రక్షించడానికి తగిన మందులు పిచికారి చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంఎం శ్రీనివాసరావు, డాక్టర్ తేజేశ్వరరావు తెలిపారు. బుధవారం కొత్తవలస సబ్ డివిజన్ పరిధిలోని ఉన్న కొత్తవలస, లక్కవరపు కోట మండలాల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ, వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంఎం శ్రీనివాస రావు, డాక్టర్ తేజేశ్వరరావు వరి క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకు ముడత, దోమ ఉన్నట్టు గుర్తించినట్లు తెలిపారు. ఆకుముడత నివారణకు 20 యస్‌సి ఎకరానికి 60 మిల్లి లీటర్లు మందును వాడాలని, చిరుపొట్ట దశలో అయితే కార్తాఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి అని తెలిపారు. ప్రస్తుతం గాలిలో తేమ, ఉష్ణోగ్రత అధికంగా ఉండటం వల్ల దోమ ఆశించిందని దోమ నివారణకి పైమెట్రోజైన్ మందును ఎకరకు 120 గ్రాములు వాడాలని తెలిపారు. ఎడిఎ విజయ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు అనుకున్నంత లేనందున రైతులు అందరూ చెరువుల్లో ఉన్న నీటిని భాగస్వామ్య పరస్పర సహకార పద్ధతిలో వరి క్షేత్రాలను కాపాడుకోవాలన్నారు. చిరు పొట్ట దశకు చేరుకోవటానికి వీలున్న చోట మల్టీ కేను 2 కిలోలు ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కొత్తవలస: పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వేస్ట్ డికంపోజర్ రైతుకి వరం

బొబ్బిలి: వేస్ట్ కంపోజర్ రైతుకు వరమని వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్ అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో వేస్ట్ కంపోజర్ తో సాగు చేస్తున్న పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరకమైన ఆవు పేడ, మూత్రం నుంచి తీసిన జీవరాశులతో ఒక పదార్థాన్ని తయారు చేస్తారని చెప్పారు. వేస్ట్ కంపోజర్ ను వినియోగిస్తే రసాయనిక ఎరువులు వాడకుండా వ్యవసాయం చేయవచ్చునని చెప్పారు. కృష్ణాపురంలో మూడేళ్ల నుంచి 100మంది రైతులు 100ఎకరాల్లో వేస్ట్ డీకంపోజర్‌తో సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - జామి

జామి -2 గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు బుధవారం ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తుందని, ప్రతి ఒక్కరూ వైసిపిని ఆదిరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామునాయుడు, వైసిపి మండల అధ్యక్షులు గొర్లె రవికుమార్, జెడ్‌పిటిసి గొర్లె సరయు, ఎంపిపి సబ్బవరపు అరుణ, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ గుడివాడ రాజేశ్వర రావు, స్థానిక సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, వైస్ సర్పంచ్ అల్లు పద్మ, అల్లు సత్యాజీ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయాల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పాఠశాలలకు వంట పాత్రలు పంపిణీ

ప్రజాశక్తి- **వంగర:** పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న గోరుముద్ద వంట సామాగ్రిని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. వీటిని నేరుగా పాఠశాలలకే ఎండియు వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు ఎంఇఒ పి ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి ఐజాక్, వైసిపి మండల అధ్యక్షులు కరణం సుదర్శన రావు, కనగల పారినాయుడు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది, సిఆర్‌పిలు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

డెంకాడ : ప్రభుత్వ పాఠశాలకు జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా అందజేసిన వంట పాత్రలను ఎంఇఒ-1 కె వెంకటరమణ, ఎంఇఒ -2 సిహెచ్ రాధాకృష్ణ బుధవారం పాఠశాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 66 పాఠశాలకు విద్యార్థుల నమోదు ఆధారంగా చేసుకొని ఐదు రకాల వంట పాత్రలను ఎబిసిఈఎఫ్‌కి పంపిణీ చేశామన్నారు. ఇందులో వంట పాత్రలు, బేసిన్లు, కళాయి, డోకులు, గరిట్లు, హస్తాలు ఉన్నాయన్నారు. ఎండిఎం వాహనాల ద్వారా మండల విద్యా వనరుల కేంద్రం నుండి పాఠశాలలన్నింటికీ ఈ వంట పాత్రలు పంపించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వంగర: వంట పాత్రలను పంపిణీ చేస్తున్న ఎంపిపి సురేష్ ముఖర్జీ



ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు, సిఐటియు నాయకులు

బకాయి చెల్లించే వరకూ పోరాటం

ప్రజాశక్తి- మెంటాడ

గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలు చెల్లించే వరకూ పోరాటం చేస్తామని సిఐటియు నాయకులు రాకోటి రాములు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బకాయి జీతాలు చెల్లించి, కొత్త హరిత రాయబారులను నియమించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. మెంటాడలో హరిత రాయబారులను విధుల నుంచి తొలగించి కొత్త వారిని నియమించడం పట్ల గ్రామ సర్పంచ్, సచివాలయ కార్యదర్శి పై రాములు మండిపడ్డారు. కొత్త వారిని నియమిం చండి కాని గత ఆరేళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించవద్దని ఎంపిడిఒ త్రివిక్రమ్ రావు వద్ద విన్నవించుకున్నారు. ఈ విషయంలో గ్రామ సర్పంచ్ కులవివక్ష చూపుతున్నారని హరిత రాయబారులు తమ గోడును ఎంపిడిఒకు తెలిపారు. యధావిధిగా తమను కొనసాగించి, బకాయి జీతాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి తామారాపల్లి సోములు, మండల హరిత రాయబారుల సంఘం అధ్యక్షుడు అలమండ సన్యాసిరావు, ట్రెజరర్ అలమండ సూరి దేవుడు, పెంచాలి రాములమ్మ తదితర గ్రామాల హరిత రాయబారులు పాల్గొన్నారు.

కాలువ నిర్మిస్తే సహించం

- మరోసారి తేల్చిచెప్పిన సిద్ధార్థ కాలనీవాసులు
- వెనుదిరిగిన అధికారులు

ప్రజాశక్తి - భోగాపురం

కాలువ నిర్మిస్తే సహించేది లేదని సిద్ధార్థ కాలనీ వాసులు మరోసారి అధికారులకు తేల్చి చెప్పారు. మండలంలోని ముంజేరు గ్రామంలో సిద్ధార్థ కాలనీలో కాలువ నిర్మాణంపై గ్రామస్తులకు కాలనీవాసులకు మధ్యగత కొన్ని రోజుల నుంచి వివాదం జరుగుతున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు బుధవారం సాయంత్రం కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బంగార్రాజు మాట్లాడుతూ అభివృద్ధి జరగాలంటే కాలువలు, రోడ్లు నిర్మించాల్సి ఉంటుందని వాటిని అడ్డుకోవద్దని అన్నారు. కానీ కాలనీవాసులు తమ వైపు కాకుండా వేరే వైపు నిర్మించాలని తెలిపారు. మీరు అనుకున్న ప్రకారం నిర్మించాలంటే అక్కడ జిరాయతీ భూమి ఉన్నందున సాధ్యం కాదని ఆయన అన్నారు. ఇరుపక్షాల నుంచి చెరో ఐదుగురితోపాటు సర్పంచ్, ఎంపిటిసిలతో కలిసి కమిటీ వేద్దామని, ఆ కమిటీ నిర్ణయం తీసుకుంటే దాని కట్టుబడి ఉండాలని ఆయన సూచించారు. దానికి కూడా కాలనీవాసులు ఒప్పుకోలేదు. దీనితో అధికారులు వెనుదిరిగారు. సిఐ బి.వి వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ అప్పలనాయుడు, ఎస్ఐ కృష్ణమూర్తి, ఇఒపిఆర్‌డి సురేష్, జెఇ చంద్రు నాయుడు తదితరులు పాల్గొన్నారు.




కాలనీ వాసులతో మాట్లాడుతున్న అధికారులు, పోలీసులు

అరుణను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి- బొబ్బిలి

జనసేన పిఎసి సభ్యులుగా ఎన్నికైన పడాల అరుణను జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, జనసేన నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి అభ్యర్థులను గెలిపించేందుకు పని చేయాలని జనసేన నేతలను అరుణ కోరారు. అనంతరం జనసేన రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన పి.యశశ్వినిను కలిసి సత్కరించారు.



పడాల అరుణను సత్కరిస్తున్న జనసేన నాయకులు